జాతీయ రహదారిపై గురుకుల విద్యార్థుల ఆందోళన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): గురుకుల హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శుక్రవారం నగరశివారు బాటసింగారం వద్ద విజయవాడ జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోడం లేదని ఆరోపించారు. 1కిలోమీటర్ దూరం వరకు విద్యార్థులు నడుచుకుంటు వెళ్లి జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్నా తెలియకపోవడం దారుణం అన్నారు. హాస్టల్ నిర్వహణ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చంపాపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఆయాకాలనీలు, బస్తీలలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు. డివిజన్‌లోని శ్రీనిధికాలనీలోని రోడ్ నెం 15లో జీహెచ్ఎంసీ నిధులు రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డును 27ఫీట్ల వెడల్పులో చేపట్టాలని అయన కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కాలనీప్రతినిధులు రమేష్, సురేష్, గోపీ, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి కాలనీకి రోడ్డును మంజూరు చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): బాటసింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగరేణి కాలనీకి బీటీరోడ్డును మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని శుక్రవారం కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, ప్రవీణ్, ప్రేమ్‌రాజ్, చెన్నారెడ్డి, శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.

7న ఛట్ పూజలు

చంపాపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరభారత్ నాగరిక్ సంఘ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈనెల 7న సాయంత్రం, 8న ఉదయం ఛట్ పూజలు నిర్వహించనున్నట్లు సంఘ్ చైర్మన్ ఎన్‌కే సింగ్ తెలిపారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఆలయ ఈఓ ఎన్.లావణ్యను శుక్రవారం సంఘ్ చైర్మన్ మర్యాద పూర్వకంగా కలిసి కోనేరులో ఛట్ పూజల నిర్వాహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ్ సభ్యులు అమర్‌జిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రినగర్‌కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఏకగ్రీవం

వనస్థలిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీగాయత్రినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా నేనావత్ సూర్యనాయక్, ప్రధాన కార్యదర్శిగా కె.చైతన్యరెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింహారెడ్డి వేమిరెడ్డి, సహాయ కార్యదర్శిగా డి.గంగాధర్ దేవటెడ్, కోశాధికారిగా వి.శేషఫణి భరద్వాజ్, లీగల్ అడ్వైజర్‌గా రామచందర్ చక్రాల, అడ్వైజరి కమిటీ సభ్యులుగా కేమ జగ్దీష్, ప్రసాద్ అన్నవరపు, చెన్న బసయ, కర్రి శివరామకృష్ణ, కొర్ర రాములునాయక్, ఇస్లావత్ జగ్దీష్‌నాయక్, కేతవత్ శ్రీకాంత్, కె.నాగేందర్, నవీన్‌కుమార్, బత్తిని రమేష్ ఎన్నికయ్యారు.

పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీ ఫేజ్-2లోని పార్కును శుక్రవారం కార్పొరేటర్ సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-15 బాలికల క్రికెట్ జట్టులో అశ్రితకు చోటు

సరూర్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అండర్-15 బాలికల క్రికెట్ జట్టులో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లార్డ్స్ హైస్కూల్ విద్యార్థిని అశ్రితా ఈశ్వర్‌గౌడ్ చోటు సంపాదించుకుంది. ఈ మేరకు బీసీసీఐ ఆమెను ఎంపిక చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ క్రమంలో శుక్రవారం లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ మరియన్ తదితరులు అశ్రిత నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈనెల 21వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కర్నాటకలోని షిమోగాలో జరుగనున్న క్రికెట్ టోర్నీలో తాను ఆడబోతున్నట్టు ఆమె తెలిపింది.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా వేణు

ఎల్‌బీనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా, మీడియా ఇన్‌చార్జిగా ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన బీబీఆర్ వేణు నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ వేణుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, గీత సెల్ కోకన్వీనర్ కిరణ్‌గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ పోరు

ఎల్‌బీనగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ పోరుసల్పుతుందని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం సరూర్‌నగర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు బోయపల్లి రాములుగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యులు బాతరాజు నర్సింహ, ఏఐటీయూసీ కార్యదర్శి మద్దిలేటి, కార్యవర్గసభ్యులు శుక్రునాయక్, ఆటో యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చిట్టిమల్ల శంకరయ్య పాల్గొన్నారు.


శాలివాహననగర్ కాలనీలో దీపావళి సంబరాల్లో టపాసులు కాల్చుతున్న విజయ్ హోమ్స్ నివాసితులు


మూసారాంబాగ్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆకట్టుకున్న బొమ్మల కొలువు


చార్మినార్‌లోని భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి


దీపావళి సంబరాలలో కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఘనంగా దీపావళి వేడుకలు

జోన్ బృందం : దీపావళి వేడుకలను గురువారం, శుక్రవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు దీపాలు వెలిగించడంతో పాటు ఇళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఇళ్లల్లో లక్ష్మీ పూజ నిర్వహించి బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఇళ్లల్లో నోములు, వ్రతాలను నిర్వహించుకున్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భక్తులు ధ్యానాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి చార్మినార్‌లోని భాగ్యలక్ష్మీఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆర్‌కేపురంలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ దంపతులు, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, సరూర్‌నగర్‌లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, తదితరులు కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.


దీపావళి సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు

దేశ ఐక్యత, సమగ్రత, భద్రతల పరిరక్షణకు సహకరించాలి

- ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యత, సమగ్రత, భద్రతల పరిరక్షణకు ప్రతీపౌరుడు సహకరించాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో పోలీసులు దేశ సమగ్రత, భద్రత, ఐక్యతల ప్రాధాన్యతను రాచకొండ పరిధి ఎల్బీనగర్ డివిజన్ పోలీసులు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎల్బీనగర్ చౌరస్తా నుంచి కొత్తపేట చౌరస్తా వరకు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ ఆధ్వర్యంలో ప్రజల ధన, మాన, ప్రాణాల పరిరక్షణకు నిత్యం భద్రత కల్పిస్తామని పోలీసులు ప్రతిజ్ఞ చేశారు. ప్రతీ పౌరుడు దేశ ఐక్యత, భద్రత, సమగ్రతల సంరక్షణ బాధ్యతను గుర్తించాలని సీపీ కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్, నాగోల్ సీఐ సూర్యానాయక్, చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, సరూర్‌నగర్ డీఐ యాదగిరి, మహిళా పీఎస్ ఎస్‌హెచ్‌ఓ సుధాకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసుల కవాతులో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

సమగ్ర ఇంటి సర్వే కోసం స్టిక్కరింగ్ ప్రారంభం

హయత్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 24 వార్డులలో స్టిక్కరింగ్ చేశారు. 22వ వార్డులో జరుగుతున్న స్టిక్కరింగ్ తీరును స్థానిక కౌన్సిలర్ కొశిక ఐలయ్యతో కలిసి కమిషనర్ అమరేందర్‌రెడ్డి పరిశీలించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 24 వార్డులలో సర్వే చేయడానికి 215 ఎన్యూమరేషన్ బ్లాకులు(ఈబీ)లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రతి బ్లాకుకు ఒక అధికారి ఉంటారని అన్నారు. 10 బ్లాకులకు ఒక సూపర్‌వైజర్ ఉంటారని తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 21మంది సూపర్‌వైజర్‌ల పర్యవేక్షణలో సమగ్ర ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు.

అందులో భాగంగా శుక్రవారం ప్రతి ఇంటికి వెళ్లి ఒక స్టిక్కర్ అంటిస్తారని తెలిపారు. మరోసారి వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తారని తెలిపారు. రెండు రోజుల్లో స్టిక్కరింగ్ పూర్తి చేసి సర్వేకు వెళ్లడం జరుగుతుందన్నారు. ప్రధానంగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వేలో 75 ప్రశ్నలు ఉంటాయన్నారు. ఇంటి యజమాని పేరు. ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు. వారి వివరాలు, ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయి. వారి చదువు, కులం వివరాలను సేకరిస్తారని తెలిపారు.


స్టిక్కరింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఐలయ్య

నేటి నుంచి కార్తీక మాసోత్సవ విశేష పూజలు

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురి వేంకటేశ్వర ఆలయంలో శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ పవిత్ర కార్తీక మాసోత్సవ విశేష పూజలు, వ్రతాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. శ్రీమన్నారాయణుడు యోగనిద్ర నుంచి మేల్కొని అందరిని అనుగ్రహించే మాసంగా భక్తులు విశ్వసిస్తారు. సాయం సంధ్య వేళ ఆకాశ దీపాన్ని వెలిగించే కార్యక్రమం కార్తీక మాస చివరి రోజువరకు కొనసాగనుంది. ఈనెల 3, 10, 12, 15తేదీల్లో సత్యనారాయణ స్వామి వ్రతం, 5న విజయ వినాయక స్వామివారికి, 15న ప్రసన్నాంజనేయస్వామికి, 24న గోదాదేవి అమ్మవారికి, 25న పద్మావతీదేవి అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. అదే విధంగా ఈనెల 19న రుద్ర హోమం, 25న పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. కాశీవిశ్వేశ్వరాలయంలో రోజూ రుద్రాభిషేకం, 10న శ్రీయాగం, 15న జ్వాలాతోరణం, 29న మహాలింగార్చన జరుపనున్నారు. ఆలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామి వారికి శనివారం నుంచి జనవరి 14వ తేదీ వరకు మండల పూజలు నిర్వహించనున్నారు. కార్తీక మాస విశేష కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు ఆలయ కార్యాలయంలో సంప్రదించవచ్చని ధర్మకర్తల మండలి తెలిపింది.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీ కాలనీలోని పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి(శనివారం) నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, విజయశ్రీ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా 2న ఆకాశ దీపోత్సవం, 5న మణవాళ మహాముణులకు అభిషేకం, 9న మాసకల్యాణం, 13న శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరుడికి తులసి అర్చన, తులసి కల్యాణం, 15న కార్తీక దీపోత్సవం, 17న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 27న సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి దివ్యానుగ్రహం పొందడంతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

రేపు కుమ్మరుల వనభోజన మహోత్సవం

మన్సూరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 3న కుమ్మరుల వనభోజన మహోత్సవాన్ని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఎల్బీనగర్ జోన్ కుమ్మర సంఘం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మర శాలివాహన ప్రజాపతి సంఘం తూర్పు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ మహోత్సవంలో ఉసిరి చెట్టుకు పూజ, శివారాధన, కుల పూర్వీకుల ఆరాధనలతో పాటు కులపెద్దల సలహాలు, సూచనలు, సన్మానాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా ఉంటాయని, శాలివాహన కుమ్మరులు పెద్ద ఎత్తున ఈ వేడుకకు విచ్చేసి కుమ్మరుల ఐక్యత ను చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం సభ్యు లు ఎలిమినేటి నారాయణ, సిర్సవాడ అంజయ్య, ఎ.సూర్యనారాయణ, శివప్రసాద్, రమేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పింఛనుదారుల కోసం దక్షిణమధ్య రైల్వే డిజిటల్ లైఫ్‌సర్టిఫికెట్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పెన్షనర్లకు పెన్షన్ కొనసాగించేందుకు ప్రతి సంవత్సరం నవంబరులో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. పెన్షన్ అండ్ పెన్షనర్ల సంక్షేమశాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెన్షన్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్) యూఐడీఏఐ, -ఎంఈటీవై సహకారంతో 73లక్షల మంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల 'ఈజ్ ఆఫ్ లివింగ్'ని పెంపొందించడానికి ముఖ ప్రమాణీకరణ(ఫేస్ అథెంటికేషన్)ను ప్రారంభించినట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో పెన్షన్‌దారులు ఫిజికల్ వెరిఫికేషన్ కోసం పెన్షన్ పంపిణీ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం ఉండదని, దీంతో సమయం ఆదా అవుతుందన్నారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ప్రమాణీకరణ ప్రక్రియకు భద్రతా అంశాన్ని జోడించడం వల్ల మోసపూరిత క్లెయిమ్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని వివరించారు.

కార్పొరేటర్ శ్వేతకు పితృవియోగం

సైదాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తండ్రి, విద్యా ప్రింటింగ్ ప్రెస్ యజమాని బద్దం సుధాకర్‌రెడ్డి(70) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నేతలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయన పార్థీవ దేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం సైదాబాద్ ధోబీఘాట్ శ్మశానవాటికలో నిర్వహించారు.


బద్దం సుధాకర్‌రెడ్డి(ఫైల్)

తాళాలు పగులగొట్టి వస్త్ర దుకాణంలో చోరీ

- రూ. 35వేల విలువైన చీరల అపహరణ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దొంగలు షాపు తాళాలు పగులగొట్టి అందులోని రూ. 35వేల విలువైన దుస్తులను అపహరించుకుపోయిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారామతిపేట గ్రామానికి చెందిన బండారి కృష్ణ వస్త్రాల వ్యాపారి. గ్రామంలోని తన ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో వస్త్రాల దుకాణం నిర్వహిస్తున్నాడు.


షాపు తాళాలు పగులగొట్టిన దొంగలు


దొంగలు చోరీ చేసిన షాపు

కాగా బుధవారం రాత్రి షాపుకు తాళం వేసి పడుకున్నాడు. గురువారం ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లి చూడగా షాపు తాళాలు పగులగొట్టి కనిపించాయి. దొంగతనం జరిగిందన్న అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా రూ. 35 వేల విలువైన చీరలతో పాటు ఇతర దుస్తులు కనిపించలేదు. వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో మంగళసూత్రం అపహరణ

హయత్‌నగర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి మంగళసూత్రాన్ని లాక్కెళ్లిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ గ్రామానికి చెందిన మేకం బాలమ్మ(65) గురువారం సాయంత్రం మట్టి ప్రమిదలు తీసుకురావడానికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్‌తో బైక్‌పై వచ్చి నాలుగు తులాల రెండు గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఈ మేరకు బాధితురాలు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజు, ఎస్ఐ లింగారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బాధితురాలితో మాట్లాడుతున్న ఏసీపీ కాశీరెడ్డి తదితరులు

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

సైదాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. ఉప్పరపల్లి అత్తాపూర్‌కు చెందిన హసీనా బేగం(36)కు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది, మతిస్థిమితం లేకపోవడంతో పదేళ్లుగా అత్తాపూర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నది. చంచల్‌గూడ నర్సింగ్‌హోంకు చికిత్స కోసం తల్లి సోమవారం తీసుకువచ్చింది. వైద్యపరీక్షల అనంతరం హసీనాను కుర్చీబెట్టి తల్లి డాక్టర్ క్యాబిన్‌లోకి వెళ్లింది. కొద్దిసేపటికి వచ్చిచూడగా కూతురు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలు వెదికినా ఆచూకీ దొరకకపోవడంతో మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.


హసీనా బేగం(ఫైల్)

అంబరాన్నంటిన 'సదర్' సంబురం

- ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు

మన్సూరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మన్సూరాబాద్ చౌరస్తా వద్ద నిర్వహించిన యాదవ సదర్ సమ్మేళనం అంబరాన్నంటింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు దున్నపోతులతో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులను అఖిలభారత యాదవ మహాసభ సభ్యులు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ వేడుకల్లో అఖిల భారత యాదవ మహాసభ సభ్యులు పోచబోయిన గణేశ్‌యాదవ్, పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, కె.జగదీశ్‌యాదవ్, ఎం.శ్రీనివాస్ యాదవ్, పి.శ్రీకాంత్‌యాదవ్, కె.రవియాదవ్, కె.చిట్టియాదవ్, కె.నగేష్‌యాదవ్, బి.యాదయ్యయాదవ్, పి.కృష్ణయాదవ్ పాల్గొన్నారు.


సదర్ సమ్మేళనంలో ఎంపీ అనిల్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఉత్సవ నిర్వాహకులు సుభాన్‌యాదవ్

పెద్దఅంబర్‌పేట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ : సదర్ ఉత్సవాలను నగర శివారు పెద్దఅంబర్‌పేట్‌లో శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేసి వాటితో విన్యాసాలు చేయించారు. బ్యాండు మేళాలతో యాదవ యువకులు హాకీ కర్రలను చేతబట్టి సదర్ సమ్మేళన్‌లో నృత్యాలను చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్, బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మరిపెల్లి అంజయ్యయాదవ్, కొత్త అశోక్ గౌడ్, కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు, పిల్లి శ్రీనివాస్‌యాదవ్, సిద్ధంకి కృష్ణారెడ్డి, విజయేందర్ రెడ్డి, దామోదర్, గంట శ్రీనివాస్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.


సదర్‌మేళాలో శ్రీరాములుయాదవ్, బ్యాంకు చైర్మన్ నర్సింహారెడ్డి


సదర్ వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్, యాదవ సంఘం నేతలు

నాదర్‌గుల్‌లో..

సరూర్‌నగర్ : సదర్ మేళాను బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యాదవ సోదరులు తమ దున్నపోతులను అందంగా అలంకరించి, వాటికి పూజలు చేసి ఆకట్టుకునే విన్యాసాలు చేయించారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, క్యామ మల్లేశ్, బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, డైరెక్టర్ గోవర్ధన్ తదితరులు హాజరై దున్నపోతుల విన్యాసాలు తిలకించారు. నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు.

కొత్తపేట : కొత్తపేటలో యాదవ సోదరులు యాదవ సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలంకరించిన దున్నపోతులను వేడుకల్లో ప్రదర్శించారు. వేడుకల్లో కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, బీజేపీ నాయకులు, యాదవ సోదరులు పాల్గొన్నారు.